ప్రజాశక్తి
గురువారం 12 సెప్టెంబర్ 2024

ఐఏబి మళ్లీ వాయిదా..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సాగునీటి సలహామండలి (ఇరిగేషన్ అడ్వయిజరీ బోర్డు ఐఏబి) సమావేశం మరోమారు వాయిదా పడింది. అనంతపురం నగరంలోని రెవన్యూ భవనంలో గురువారం ఉదయం సమావేశం నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. అయితే చివరి నిమిషంలో సాగునీటి సలహామండలి సమావేశాన్ని వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నాయి. విజయవాడలో వరద పరిస్థితుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

మరమ్మతులకు నోచని ప్రాజెక్టులు

ఉమ్మడి అనంతపురం జిల్లాలోనున్న సాగునీటి ప్రాజెక్టులు కనీసం మరమ్మతులకు నోచని పరిస్థితుల్లో ఉన్నాయి. పిఎబిఆర్, మిడ్‌పెన్నార్, పేరూరు ప్రాజెక్టులున్నాయి. వీటికి క్రస్ట్ గేట్లకు కనీసం గ్రీసు కూడా పెట్టలేని దయనీయ స్థితిలోనున్నాయి. ప్రభుత్వం నిర్వహణకు కనీస నిధులు కూడా కేటాయించలేదు. ఇక అనంతపురం జిల్లాకు అత్యంత ప్రధానమైన సాగునీటి ప్రాజెక్టు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ. ఈ కాలువ ఆధునీకరణ పనులను పూర్తి రద్దు చేశారు. 70 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ కాలువలు గట్లు పూర్తిగా బలహీనపడ్డాయి. ఎప్పుడు ఎక్కడ గండిపడుతుందో తెలియకుండా ఉంది. దీంతో కాలువలో నీటిని కూడా పూర్తి సామర్థ్యంతో తీసుకోలేకపోతున్నారు. తక్షణ మరమ్మతులకైనా రూ.30 కోట్లు నిధులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇక హంద్రీనీవా పరిస్థితి అదే రకంగా ఉంది. కాలువ ప్రవాహ సామర్థ్యాన్ని ఆరు వేల క్యూసెక్కులకు పెంచుతామని ప్రకటించారు. ఇది కూడా టెండర్ల వరకే పరిమితమైంది. మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ, జిబిసి ఆధునీకరణ పనులు సైతం మధ్యలోనే ఆగిపోయాయి.

ఈ సీజన్ ఇక అంతేనా..?

జిల్లాలో సాగు, తాగునీటి ప్రాజెక్టులు పరిస్థితి దయానయంగా మారడంతోపాటు ఈ ఏడాది తుంగభద్ర డ్యామ్ గేట్లు కూడా కొట్టుకుపోయి నీటి నష్టం జరిగింది. ఈ నేపథ్యంలో జిల్లాకు రావాల్సినన్ని నీళ్లు ఈసారి వచ్చే అవకాశాల్లేకుండా పోయాయి. ఇప్పుడున్న నీటి లభ్యత ప్రకారమైతే 26 టిఎంసిల వరకు రావొచ్చని అంచనా వేశారు. ఇందులో పది టిఎంసిలు తాగు నీటికి, 16 టిఎంసిలు సాగునీటికి కేటాయించాలని ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందులో ఇప్పటికే జిబిసి, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు కింద ఆయకట్టుకు నీటిని అందిస్తున్నారు. ఇక మిడ్‌పెన్నార్ దక్షిన కాలువ కిందనున్న ఆయకట్టుకు, ఉత్తర కాలువ కిందనున్న ఆయకట్టుకు నీటి కేటాయింపులు తేదీలు నిర్ణయించాల్సి ఉంది. దీంతోపాటు జిల్లాలోని సాగునీటి సమస్యలపై చర్చించి నిర్ణయాలు చేయాల్సి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఐఏబి సమావేశం ఖరీఫ్ కాలం పూర్తవుతున్నా నిర్వహించలేదు. దీంతో దిగువనున్న శింగనమల, గార్లదిన్నె, తాడిపత్రి ప్రాంతాలతోపాటు, రాప్తాడు నియోజకవర్గంలోని ఆయకట్టు నీటి విడుదలపై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. సాధారణంగా అయితే జులై ఆఖరు లేదా ఆగస్టు మొదటి వారంలోపే ఈ సమావేశాన్ని నిర్ణయించే వారు. ఈసారి ఈ సమావేశం ఖరీఫ్ ముగుస్తున్నా జరగకపోవడం గమనార్హం. ప్రస్తుతం నిర్వహిస్తామని ప్రకటించి మరోమారు వాయిదా వేయడంతో జిల్లాకు సాగు, తాగునీటి అవసరాలపై చర్చ, కేటాయింపులు మరో సారి వాయిదా పడ్డాయి.

కదిరిలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

వెళ్లి రావయ్యా.. గణపయ్యా..!

◆ జిల్లాలో ముగిసిన చవితి ఉత్సవాలు ◆ కన్నుల పండువగా నిమజ్జనోత్సవాలు

జిల్లాలో వినాయక చవితి వేడుకలు ముగిశాయి. గత ఐదు రోజులుగా మండపాల్లో కొలువుదీరిన వినాయకుడు ప్రత్యేక పూజలు అందుకున్నారు. ఉత్సవాల్లో చివరి రోజు బుధవారం నాడు విఘ్నేశ్వరుని నిమజ్జనానికి తీసుకెళ్లారు. జిల్లా వ్యాప్తంగా నిమజ్జనోత్సవ కార్యక్రమం సందడిగా సాగింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లో నిమజ్జన కార్యక్రమాలను పూర్తి చేశారు. ఐదవ రోజు బుధవారం నాడు అన్ని ప్రాంతాల్లోనూ ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. నిమజ్జనోత్సవం సందర్భంగా యువకులు, పిల్లలు, మహిళలు నృత్యాలు చేస్తూ కేరింతలు కొట్టారు. రంగులు జల్లుకుంటూ డీజే శబ్దాల నడుమ సంతోషంగా నృత్యాలు చేశారు. నిమజ్జనంలో ఎలాంటి అపశ్రుతులూ చోటు చేసుకోకుండా పోలీసు, ఇతర శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అనంతపురం నగరంలో రాత్రి 1 గంట వరకు నిమజ్జన కార్యక్రమాలు కొనసాగాయి.

నిమజ్జనానికి తరలి వెళ్తున్న భారీ విగ్రహం

కదిరిలో నిర్వహించిన శోభాయాత్రలో పాల్గొన్న ప్రజలు

అధికారులతో మాట్లాడుతున్న జి.ఓబులు

తాగునీటి సరఫరా కార్మికుల సమ్మె కొనసాగింపు

అధికారులతో చర్చలు విఫలం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వేతనాలు, ఈఎస్ఐ బకాయిలు చెల్లించాలని కోరుతూ శ్రీ సత్యసాయి, శ్రీరామ్ రెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె నేపథ్యంలో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులతో అధికారులు బుధవారం నాడు చర్చలు నిర్వహించారు. బకాయి వేతనాల చెల్లింపులో అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో చర్చలు విఫలం అయ్యాయి. అధికారులు ప్రస్తుతం సమ్మె విరమించాలని, వేతనాలకు సంబంధించి ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. వేతనాలు చెల్లిస్తేనే సమ్మె ఆపుతామని కార్మిక సంఘాల నాయకులు అధికారులకు తేల్చి చెప్పారు. దీంతో సమ్మెను యథాతథంగా కొనసాగించనున్నట్లు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు బకాయి వేతనాలు ఇవ్వకుండా సమ్మెను విరమింపజేయాలని కోరడం సరికాదన్నారు. కార్మికులు కోరుతున్న న్యాయమైన సమస్యలన్నింటినీ పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయాలను కలెక్టర్‌కు తెలియజేస్తామన్నారు. ప్రస్తుతం సమ్మె యథావిధిగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తాగునీటి సరఫరా యూనియన్ అధ్యక్షులు ఎర్రిస్వామి, వన్నూరుస్వామి, కొండారెడ్డి, సోమశేఖర్, తిప్పేస్వామి, నారాయణస్వామి, ప్రభాకర్, గంగాధర్, రామాంజనేయులు, నరేష్, రమేష్, రాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు పరిధిలోని జూలై నెలలో నిర్వహించిన బీటెక్ పరీక్షల ఫలితాలు బుధవారం విడుదల అయ్యాయి. బీటెక్ మూడవ సంవత్సరం, రెండవ సెమిస్టర్ (ఆర్–19), (ఆర్ 15) సప్లిమెంటరీ, బీటెక్ మూడవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్ 19), (ఆర్ 15) సప్లిమెంటరీ, బీటెక్ నాల్గవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్ 19), (ఆర్ 15) సప్లిమెంటరీ, ఎంబీఏ ఒకటవ సెమిస్టర్ (ఆర్ 21), (ఆర్ 17) సప్లిమెంటరీ, ఎంసీఏ .ఒకటవ సెమిస్టర్ (ఆర్ 21), (ఆర్ 20) సప్లిమెంటరీ, ఎంసీఏ నాలుగవ సెమిస్టర్ (ఆర్ 21), రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎమ్మెస్సీ నాలుగవ సెమిస్టర్ (ఆర్ 20) సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు విడుదల అయ్యాయి. ఉపకులపతి ఆచార్య హెచ్. సుదర్శన రావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య ఆదేశాల మేరకు విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య వి.నాగప్రసాద్ నాయుడు, కంట్రోలర్ అఫ్ ఎక్సామినేషన్ ఆచార్య ఎపి.శివ కుమార్, అడిషినల్ కంట్రోలర్స్ ఆచార్య జి.శంకర్ శేఖర్ రాజు, డా॥ఎం.అంకారావు, డా॥ఎస్.శ్రీధర్ తెలిపారు. పరీక్షా ఫలితాల కోసం www.jntuaresults.inను సంప్రధించాలని తెలిపారు.

బాలికల భద్రత సామాజిక బాధ్యత

పజాశక్తి - రొద్దం

బాలికల భద్రత సామాజిక బాధ్యత అని ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా పని చేసినప్పుడే బాల్య వివాహ వ్యవస్థను రూపు మాపవచ్చని ఐసిడిఎస్ అధికారిని శాంతలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని చోలెమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్‌డిటి మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలికలను రక్షిద్దాం –బాలికలను చదవనిద్దాం అనే కార్యక్రమం ఆర్‌డిటి మహిళా విభాగం టీం లీడర్ ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పెనుకొండ ప్రాజెక్ట్ మహిళా శిశు అభివృద్ధి పథక అధికారిని డాక్టర్ శాంతలక్ష్మి మాట్లాడుతూ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల ఒకటో తేదీ నుండి 30 వరకు పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆడ పిల్లలు బాగా చదువుకోవాలని, మంచి ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యంగా ఉంటూ ఆత్మస్థైర్యంతో ఉండాలని చెప్పారు. ఆడ పిల్లలకు 18 సంవత్సరాలు మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండిన తరువాత వివాహ ప్రయత్నాలు చేయాలని సూచించారు. ఆర్‌డిటి మహిళా విభాగం టీం లీడర్ ఆదినారాయణ మాట్లాడుతూ ఆర్‌డిటి ప్రతి మండలంలో ప్రభుత్వ శాఖల సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణ కోసం ముందస్తు చర్యగా గ్రామ స్థాయిలో పాఠశాలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాంబ శివారెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ సుజాతమ్మ, ఉపాధ్యాయులు మమత, రామకృష్ణమ్మ, రోహిణి, ఎఎన్ఎం వెంకటలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

◆ ఇంటింటా చెత్త సేకరణపై అవగాహన కల్పించాలి ◆ కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్
ఓబుళదేవరచెరువు, అమడగూరు

ఓబుళదేవరచెరువు ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ టిఎస్.చేతన్

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మంచి ఆరోగ్యం లభిస్తుందని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలిపారు. బుధవారం నాడు గోరంట్ల, ఆమడగూరు, ఓబుళదేవరచెరువు మండలాల్లో పర్యటించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులను పరిశీలించారు. గోరంట్ల మండల ప్రధాన కేంద్రంలో రాగిగుంట చెరువు సమీపాన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి తడి, పొడి చెత్తను ఎలా సేకరిస్తున్నారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. గోరంట్ల గ్రేడ్ వన్ పంచాయతీగా ఉన్నందున గ్రామ సచివాలయం సిబ్బంది పంచాయతీరాజ్ సిబ్బంది అందరూ కలసికట్టుగా చెత్త రహిత గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్వచ్ఛతను మెరుగుపరిచేలా ప్రతి ఒక్కరు బాధ్యతగా పని చేయాలన్నారు. అనంతరం హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా పంపింగ్ యంత్రాన్ని పరిశీలించారు. గోరంట్ల పట్టణంలో ఓవర్ హెడ్ ట్యాంకును పరిశీలించారు. ఆమడగూరు మండల కేంద్రంలో చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు అన్నింటినీ సంపద తయారీ కేంద్రాల్లో నిల్వ ఉంచి వాటిని విక్రయించాలని తెలిపారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయం సిబ్బంది ప్రతి ఒక్కరూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. వ్యవసాయ గోదామును పరిశీలించి, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి తెలియజేశారు. మహమ్మాదాబాద్‌లో చెత్త సంపద తయారీ కేంద్రంలో మొక్కను నాటారు. అక్కడి నుంచి ఓబుళదేవరచెరువు మండలం ఆకుతోటపల్లిలో చెత్త సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఓపీ శాతం పెరగాలని సిబ్బందికి సూచించారు. త్వరలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని ప్రారంభించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డిఎల్‌డిఒ శివకుమారి, ఆయా మండలాల ఎంపిడిఒలు, తహశీల్దార్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత

నిత్యావసరాలు అందజేస్తున్న రత్నాకర్, తదితరులు

చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

విజయవాడ వరద బాధితులకు సత్య సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవాదళ్ సభ్యులు చేయూతను అందించారు. బుధవారం సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె. రత్నాకర్ తో పాటు ట్రస్టు సభ్యులు, సేవాదళ్ సభ్యులు ఒక్క రోజులోనే 7వేల కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేసి తమ సేవా నిరతిని చాటుకున్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో పలు జిల్లాల్లో వరద బాధితులు ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్న సమయంలో ట్రస్టు ముందుకొచ్చి బాధితులకు బియ్యం, చింతపండు, ఉప్పు, మినప పొడి, ఉల్లి, ఎండుమిరప, టీ పొడి, పసుపు, వంటనూనె, సబ్బులు, కొబ్బరి నూనె, బిస్కెట్లు, నీటి బాటిల్లు, నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. వీటిని ప్యాకింగ్ చేయడానికి 300 మంది మహిళా సేవా సభ్యులు పాల్గొన్నట్లు ట్రస్టు వర్గాలు తెలిపాయి. ఆర్‌జె రత్నాకర్ తో పాటు విజయవాడ ఎంపీ, ఎమ్మెల్యే కేశినేని శివనాథ్, బోండా ఉమామహేశ్వరరావు తదితరులు విజయవాడలోని న్యూ రాజీవ్ నగర్, పాత రాజీవ్ కాలనీ, కొత్తపేట, శాంతినగర్ తదితర ప్రాంతాల్లోని నిత్యావసర వస్తువులు పంపిణీలో పాల్గొన్నారు.

మడకశిర :వరద బాధితులకు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తనవంతుగా చేయూతను అందిస్తున్నారు. 55వ డివిజన్‌లో వరద బాధితులకు చీరలు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు విజయవాడలోని 55వ డివిజన్లో వారికి మొదటి రోజు తనవంతుగా 2 లక్షల రూపాయల విలువైన చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందజేశారు. తనకు కేటాయించిన డివిజన్లో బుధవారం దాదాపు 2500 చీరలు మహిళలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్ జాయింట్ కలెక్టర్ ఎమ్మెస్ బేగ్, డివిజన్ అధ్యక్షులు జాహిద్ , ప్రధాన కార్యదర్శి శంకర్ , వడ్డాది రమణ, చిన్న, ఎస్సీ సెల్ అధ్యక్షులు రామారావు , 55 డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో కార్మికులకు కనీస వసతులు కల్పించాలి



మున్సిపల్ ఎంఇకి సమస్యను వివరిస్తున్న కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

విజయవాడలోని వరద ప్రాంతాల్లో విధులు నిర్వహించటానికి వెళ్లిన పారిశుధ్య కార్మికులకు కనీస సౌకర్యాలను కల్పించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి పి జగదీష్ డిమెండ్ చేశారు. బుధవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి, మున్సిపల్ కమిషనర్ చాంబర్ ముందు ధర్నా చేపట్టారు. ఇన్‌చార్జ్ కమిషనర్, మున్సిపల్ ఎంఇ విశ్వనాథ్‌కి వినతిని ఇచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి పి జగదీష్ మాట్లాడుతు విజయవాడ వరద ప్రాంతంలో సేవలను అందించడానికి హిందూపురం మున్సిపల్ కార్యాలయం నుంచి దాదాపు 85 మంది వరకు మున్సిపల్ పారిశుధ్యకార్మికులను తీసుకు వెళ్లారన్నారు. అయితే కార్మికులకు కనీస సౌకర్యాలను కల్పించకపోవటంతో సమయానికి ఆహారం, వైద్య సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు నిత్యం నీటిలో పనులు చేయడం వలన చాలామంది కార్మికులు గాయాల పాలయ్యారన్నారు. అనారోగ్యం పాలైన ఏ ఒక్క కార్మికునికి వైద్య సదుపాయం కానీ మందులు సైతం ఇవ్వడం లేదన్నారు. వేసుకన్న గుడ్డలు తడిసి ముద్దయి మురిగిపోయిన బట్టలనే వారం రోజులు పాటు కార్మికులు ధరించి చాలా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రాత్రి పడుకునే సమయంలో కార్మికులకు దుప్పట్లు కూడా ఇవ్వకపోగా అక్కడ ఉన్న అధికారులు కార్మికులను బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముంపు ప్రాంతాల పర్యటనలో భాగంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. ఉమా మహేశ్వరరావు బృందం పర్యటనలో భాగంగా కార్మికులు, మహిళలు కన్నీటి పర్యంతం అవుతూ వారి పడుతున్న బాధలను చెబుతున్నారన్నారు. వరద బాధితుల సహాయార్థం సేవలు చేయడానికి వెళ్లిన తమ కార్మికులు ఇక్కడికి వచ్చి వారి భాదలను వివరిస్తున్నారని చెప్పారు. హిందూపురం నుండి వెళ్లిన కార్మికులందరు తిరిగి వచ్చారని, వరద ప్రాంతాల్లో సేవలను అందించి వచ్చిన కార్మికులందరికి వైద్య పరీక్షలను చేయించి, వారందరికి వేతనంతో కూడిన 5 రోజుల సెలవులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కోశాధికారి ఏ ఆనందం, ఉపాధ్యక్షులు డి రామచంద్ర, హెచ్. మూర్తి, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమానికి మద్దతు తెలుపుతున్న కోటా సత్యం

స్పష్టమైన హామీ ఇచ్చేంతవరకు నిరసన కొనసాగిస్తాం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వం నుంచి తమకు స్పష్టమైన హామీ వచ్చేంతవరకు నిరసన కొనసాగిస్తామని సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు తెలిపారు. పట్టణంలోని పంప్ హౌస్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష బుధవారానికి ఏడవ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పీసీసీ వైస్ ప్రెసిడెంట్ కోటా సత్యనారాయణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఉమ్మడి అనంతపురం జిల్లాలో సత్యసాయి, శ్రీరామ్ రెడ్డి వాటర్ ప్రాజెక్టులో పనిచేసే కార్మికులు 700 మంది ఉన్నారని, వారికి ఆరు నెలల నుంచి వేతనాలు ఇవ్వకుంటే వారి కుటుంబాలు ఎలా పోషించుకుంటారని అన్నారు. అదేవిధంగా నేడు రాష్ట్ర ప్రభుత్వం రూ. 30 కోట్లు నిధులు మంజూరు చేయగా కార్మికులు వాటితో సంతృప్తి చెందలేదన్నారు. వారికి ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. వారు చేస్తున్న నిరసన న్యాయమైనదన్నారు. ఈ సందర్భంగా కార్మికుల యూనియన్ నాయకుడు మధుసూదన్ మాట్లాడుతూ తమకు రావాల్సిన 7 నెలల వేతనాలు విడుదల చేసినట్లు తెలిపారన్నారు. అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, సంబంధిత అధికారులకు, తమకు మద్దతు తెలిపిన వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అయితే పిఎఫ్ చెల్లింపు ఈఎస్ఐ అమలుపై స్పష్టమైన వివరణ లేదన్నారు. వీటిపై తగిన హామీలు ఇచ్చేంతవరకు నిరసన కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పైపల్లి గంగాధర్, యూనియన్ నాయకులు రమేష్, శ్రీనివాస్, సత్యం, వెంకటేష్, చంద్ర, రవి, రఘు తదితరులు పాల్గొన్నారు.

తపాలా శాఖ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-హిందూపురం

అన్ని వర్గాల సంక్షేమార్థం తపాలా శాఖ అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పోస్ట్ మాస్టర్ మార్కండేయులు కోరారు. బుధవారం స్థానిక అదనపు జిల్లా కోర్టు ఆవరణలో తపాలా శాఖ అమలు చేస్తున్న పథకాలపై అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ ఆధ్వర్యంలో న్యాయవాదులు, న్యాయస్థానాల సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టుమాస్టర్ మార్కండేయులు మాట్లాడుతూ సామాన్య, మధ్యతరగతి వర్గాలను దృష్టిలో ఉంచుకొని తపాలా శాఖ ఎన్నో పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. అనంతరం అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ మాట్లాడుతూ ప్రైవేటు బీమా సంస్థల్లో ఇన్సూరెన్సులు చేసి మోసపోకుండా తక్కువ ప్రీమియంతో తపాలా శాఖ అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రోడ్డెక్కిన క్లాప్ డ్రైవర్లు

ఆగిన ఇంటింటి చెత్త సేకరణ

ప్రజాశక్తి- హిందూపురం

ఇంటింటి చెత్త సేకరణ చేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లకు 10 నెలల నుంచి వేతనాలు అందక పోవడంతో బుధవారం విధులను బహిష్కరించి సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా క్లాప్ ఆటో డ్రైవర్లు వారు ఇంటింటికి వెళ్లి చెత్త సేరకరించే వాహనాలతో సైరన్ మోగిస్తు ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ సర్కిల్ లో వాహనాలను ఆపి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా క్లాప్ ఆటో డ్రైవర్లు నరసింహులు, అనిల్‌కుమార్ మాట్లాడుతు గత వైసిపి ప్రభుత్వ హయాంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్)పథకం కింద తమను వాహనాల డ్రైవర్లుగా నియమించారన్నారు. నియమించే సమయంలో రూ.12వేలు వేతనాలు ఇస్తామని చెప్పి రూ.10,118 మాత్రమే చెల్లించారని ఇది సైతం ప్రతి నెలా ఇవ్వలేదని అన్నారు. గత ప్రభుత్వం సమయంలో 7 నెలల వేతనాలు ఇవ్వక పోవడంతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టామన్నారు. వాహనాలను ఆపి, తాము ఇతర పనులు చూసుకున్నామన్నారు. ఎన్నికల అనంతరం పెండింగ్ వేతనాలతో పాటు ప్రతి నెల వేతనాలను అందించే విధంగా చర్యలు తీసుకుంటామని, వాహనాలతో ఇంటింటి చెత్త సేకరణ చేపట్టాని మున్సిపల్ కమిషనర్ అప్పట్లో సూచించారని దీంతో విధులకు హాజరయ్యామని చెప్పారు. కూటమి ప్రభుత్వం సైతం ఇప్పటి వరకు వేతనాలు మంజూరు చేయలేదన్నారు. ఇప్పటికైన బకాయి వేతనాలను వెంటనే మంజూరు చేయాలని. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



వాహనాలతో ర్యాలీ నిర్వహిస్తున్న క్లాప్ డ్రైవర్లు

ఉత్సాహంగా గణేశుడి శోభాయాత్ర



శోభాయాత్ర రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే కందికుంట, తదితరులు

కదిరి, హిందూపురంలో వినాయక విగ్రహాల ఊరేగింపు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణంలో వినాయకుడి నిమజ్జనం శోభాయాత్ర కోలాహలంగా సాగింది. వినాయక చవితి సందర్భంగా పట్టణంలో పలుచోట్ల దాదాపు 150 పైగా విగ్రహాలు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పట్టణ ప్రజలు వివిధ చోట్ల నెలకొల్పారు. వినాయక చవితి పురస్కరించుకొని ఐదు రోజులు పాటు ప్రత్యేక పూజల అనంతరం విగ్రహాలను బుధవారం నిమజ్జనం చేశారు. కదిరి పట్టణ పరిధిలోని కొత్త బైపాస్ రోడ్డు కర్రవులకుంటలో విగ్రహాల నిమజ్జనానికి అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. బుధవారం ముందుగా పట్టణంలోని ఖాద్రీశుడి ఆలయం వద్ద నెలకొల్పిన వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనం కొరకు కదిరి రైల్వే స్టేషన్ వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ అర్చకులు పట్టణ ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజలలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు. రథాన్ని ఎమ్మెల్యే కందికుంట ముందుకు లాగి శోభాయాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర రైల్వే స్టేషన్ నుండి మొదలై ఇందిరాగాంధీ సర్కిల్ ,అంబేద్కర్ సర్కిల్, వేమారెడ్డి కూడలి మీదుగా టవర్ క్లాక్, కోనేరు హిందూపూర్ రోడ్డు మీదుగా నిమజ్జనం ప్రాంతం వెంకటప్పకుంట వరకు సాగింది. శోభాయాత్రను తిలకించేందుకు పట్టణ ప్రజలు భారీగా తరలివచ్చారు. సింహ కోట ఉత్సవ కమిటీ సభ్యులు కోరిక మేరకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్వయంగా సింహ కోట వినాయకుని రథం ట్రాక్టర్ నడుపుతూ ఉత్సవ కమిటీ సభ్యులను యువకులను ఉత్సాహపరిచారు. శోభాయాత్రలో కేరళ నుంచి విచ్చేసిన వాయిద్య కళాకారుల బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ర్యాలీలో టపాసులు పేలుస్తూ డీజేలు ఏర్పాటు చేయడంతో యువతి యువకులు ఉత్సాహంగా ముందుకు సాగారు. నిమజ్జనం లో ఎలాంటి అవాంఛనీయ సంఘటన లు జరగకుండా జిల్లా ఎస్పీ రత్న, అడిషనల్ ఎస్పీ అర్ల శ్రీనివాసులు శోభాయాత్రను పర్యవేక్షించారు. డిఎస్పి శ్రీలత ఆధ్వర్యంలో ముగ్గురు డీఎస్పీలు, 10 మంది సిఐలు 500 మంది పోలీసులు తో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. పలు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ మన దేశంలో భిన్నత్వంలో ఏకత్వం ఉందన్నారు. కుల, మతాల మధ్యన తారతమ్యాలు ఉండకూడదు అన్నారు. ముఖ్యంగా యువత సంప్రదాయాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

హిందూపురం : వినాయక చవితి సందర్భంగా ఐదు రోజుల ప్రత్యేక పూజలు అందుకున్న గణనాధులను బుధవారం నిమజ్జనానికి తరలించారు. మునిసిపల్ పరిధిలోని సడ్లపల్లి, ఎన్. టి.ఆర్ కాలనీలో కొలువుదీరిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున యువకులు, భారీ ఎత్తున మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బుక్కపట్నం : మండల కేంద్రంలో గణనాథుని విగ్రహాలు బుధవారం కోలాహలంగా నిమజ్జనానికి తరలి వెళ్లాయి. యువకులు కేరింతలు, డప్పు వాయిద్యాలు , విద్యుత్ దీపాల అలంకరణ మధ్య కోలాహలంగా స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. నిమజ్జనం సందర్భంగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు..

మద్యం అక్రమ రవాణా కేసులో నిందితుడికి జైలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

కర్నాటక మద్యం అక్రమ రవాణా కేసులో నేరం రుజువు కావడంతో షేక్ నూర్ మహమ్మద్ అనే వ్యక్తికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 2 లక్షల జరిమానా విధిస్తూ పెనుగొండ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి బొజ్జప్ప బుధవారం తీర్పు వెల్లడించారు. ఈ కేసువివరాలు ఇలా ఉన్నాయి కడప జిల్లా సింహాద్రిపురం గ్రామానికి చెందిన షేక్ నూర్ మొహమ్మద్ బాష 18-07- 2020న ఎలాంటి అనుమతులు లేకుండా కర్నాటక రాష్ట్రం నుండి మద్యం తరలిస్తుండగా అప్పటి గోరంట్ల ఇన్స్‌పెక్టర్ జయ నాయక్, సిబ్బంది నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. 26- 07 -2021న పెనుకొండ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేసినారు. కేసు విచారణలో నిందితుడి నేరం రుజువైనందున జడ్జి బొజ్జప్ప బుధవారం తీర్పు వెలువరించారు. నిందుతుడు నూర్ మొహమ్మద్‌బాషాకు 3 సంవత్సరాలు జైలు శిక్ష, రూ. 2లక్షల జరిమాన విధించారని గోరంట్ల పోలీసు స్టేషన్ ఇన్స్‌స్పెక్టరు శేఖర్ తెలిపారు. ఈ కేసులో నిందితునిపై నేరం నిరూపణ అయ్యేవిధంగా పనిచేసిన ఎంపిపి శ్యామల, సిఐ శేఖర్, కోర్టు కానిస్టేబుళ్లకరుణాకర్, భాస్కర్‌ను జిల్లా ఎస్పీ అభినందించారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని గణపతిపల్లికి చెందిన వివాహిత బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందన గౌతమి గ్రామంలోనే చెక్ డ్యాంలో పడి ఆత్మహత్యకు పాల్పడింది. ఇంటిలో గొడవ జరగడంతో మనస్థాపానికి గురైన గౌతమి మూడు రోజుల క్రితం ఇంటి నుండి బయటకు వెళ్ళిపోగా కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికి మంగళవారం పరిగి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు మృతురాలి నరసింహా మూర్తి తెలిపారు. బుధవారంఉదయం గ్రామ శివారులోనే చెక్ డ్యాం లో గౌతమి మృతదేహాన్ని స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు తెలిపారు. పోలీసుల సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగడు తెలిపారు.

విద్యార్థులకు తాగునీటి ఇక్కట్లు

ప్రజాశక్తి - నంబుల పూలకుంట

మండల పరిధిలోని కమ్మకుంటపల్లిలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. పాఠశాలలో దాదాపు 35 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు వీరు మధ్యాహ్న భోజన సమయంలోనూ, కాలకృత్యాలు తీర్చుకునే సమయంలోనూ నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. గత సంవత్సరంలో ఏర్పాటు చేసిన బోరు పంపు చెడిపోవడంతో మరమ్మతులు చేయకపోవడంతో నీటి సమస్య ఏర్పడింది. దీంతో విద్యార్థులు తమ ఇళ్లనుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

సాగు పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి -బుక్కపట్నం

వేరుశనగలో సాగు పద్ధతులను వినియోగించుకొని అధిక దిగుబడును పొందవచ్చని ఏడీఏ సనావుల్లా తెలిపారు. బుధవారం మండల పరిధిలోని గశిక వారి పల్లిలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అతి తక్కువ పురుగుమందులు, రసాయనక ఎరువులు వాడి, నాణ్యమైన అధిక నికర ఆదాయం పొందవచ్చునని చెప్పారు. అందుకు అవలంభించాల్సిన సాగు పద్దతులను ఆయన రైతులకు వివరించారు.. రైతులు తప్పనిసరిగా సేంద్రియ ఎరువులు జిప్సం, వేప నూనెను పంటలకు వాడాలని సూచించారు. అనంతరం రైతు నరసింహులు సాగు చేసిన టమోటా పొలాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సతీష్ బాబు, ఏఈవోలు సునీత, సుధా లక్ష్మి, రైతు భరోసా సిబ్బంది మనోహర్, అభినయ్ కుమార్, రైతులు క్రిష్టప్ప,వీరప్ప, వెంకటనారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు..

కెజిబివి తనిఖీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని జగరాజుపల్లి కెజిబివిని ఎంఇఒ బొల్లె ప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వంటగదిలో కాయగూరలను సరుకులను, పరిశీలించారు. వాటి నాణ్యత గురించి తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనం నాణ్యత గురించి, మెనూ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. లెసన్ ప్లాన్ కచ్చితంగా అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పిచ్చి మొక్కలను తొలగించాలని, రాత్రిపూట విద్యార్థుల పట్ల జాగ్రత్తలు వహించాలని సూచించారు.

రోగులకు బ్రెడ్లు పంపిణీ

ప్రజాశక్తి- కదిరి టౌన్

రాజంపేట పార్లమెంట్ సభ్యులు మిథున్ రెడ్డి జన్మదినం సందర్భంగా వైసిపి రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షులు డాక్టర్ బతల హరి ప్రసాద్ ఆధ్వర్యంలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. బుధవారం కదిరి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వీటిని రోగులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబ్జాన్, ముబారక్, ఇర్ఫాన్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ సీనినియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కదిరి

E.P.NO:7/2018 in O.S.NO:133/2013

Between:

ఎమ్.గంగన్న ...D.Hr

And

1. బి.శివమ్మ (died) rep by him LRs 2 &3,
2. బడా వెంకటరెడ్డి
3. జి.వెంకటరత్నమ్మ ...J.Drs

To,

J.Drs No: బడా వెంకటరెడ్డి S/o Not Know, age 75 years, Hindu, D.No:1-21, నల్లసింగ్యగాలిపల్లి గ్రామం, నల్లమాడ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.

J.Drs No 2కు కోర్టు నోటీసు

పై తెలిపిన D.Hr మీ మీద కోర్టువారు యిచ్చిన Decree ని అమలు చేయటకు మరియు E.P. షెడ్యూలు దావా ఆస్తిని జప్తు చేసి Decree Amount ను రాబట్టుటకు ఈ పిటిషన్‌ను వేసివున్నారు. నీ హాజరు నిమిత్తం పై కోర్టులో 27/09/2024వ తేదిన వాయిదా వేసి వున్నారు. ఆ రోజు నీవు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెనని ఇందు మూలంగా మీకు తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:27/09/2024
స్థలం:కదిరి

కె.నాగేంద్రరెడ్డి బి.ఎ., బి.ఎల్,
D.Hr తరుపు న్యాయవాది, కదిరి.

స్వచ్ఛత హి సేవలో భాగస్వాములు కావాలి : కలెక్టర్

టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

స్వచ్ఛత హి సేవ అవగాహన కార్యక్రమాలు ఈనెల 14 నుంచి 17 వరకు జరుగుతాయని, అలాగే అక్టోబర్ 2 వరకు జరిగే కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ టి ఎస్ చేతన్ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లో మండల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఈవో ఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలపై సమీక్షించారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు డిపిఒ విజయ్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ మల్లికార్జున, పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాద, డిఎల్‌డిఒ శివకుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామ, పట్టణ వీధులలో పరిసరాల పరిశుభ్రత ముఖ్యమన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికవద్దంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందన్నారు. అధికారులందరూ సమన్వయంతో పరిశుభ్రమైన వాతావరణం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో అన్నిచోట్ల శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాలపై రోజు ఎంపీడీవోల పర్యవేక్షణలో జరగాలని ఎప్పటికప్పుడు ఫోటోలు నివేదికలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

ఈనెల 14న కదిరిలోనిజిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శ్రీ సత్యసాయి జిల్లాలోని మహిళా ఉపాధ్యాయులకు జరిగే క్రీడా పోటీలను విజయవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా కార్యదర్శులు లక్ష్మీనారాయణ, శివశంకర్, మంజుల కోరారు. ఈ మేరకు వారు స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో క్రీడాపోటీలకు సంబందించిన పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుటిఎఫ్ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా ఈ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న మహిళా ఉపాధ్యాయులందరూ ఈ పోటీలలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు బాబు, ఈశ్వరయ్య, పెద్దన్న, బాబావలి, హెచ్ఎం నూర్జహాన్, ఉపాధ్యాయులు అనంతలక్ష్మి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

కోటా సత్యంను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి : కోటా సత్యం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

కాంగ్రెస్ పార్టీని బలోపేతానికి కృషి చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటా సత్యం పేర్కొన్నారు. ఈ మేరకు ఆయనను బుధవారంకాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కోటా సత్యం మాట్లాడుతూ కేంద్రంలో గత సార్వత్రిక ఎన్నికలలో గణనీయంగా పార్టీని ప్రజలు ఆదరించారన్నారు. త్వరలోనే కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూడా పార్టీకి మంచి రోజులు రానున్నాయన్నారు. జిల్లా, నియోజకవర్గాలు, డివిజన్, మండల స్థాయిలలో కమిటీలు వేసి పార్టీ బలోపేతం చేస్తామన్నారు. పార్టీ అప్పగించిన కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కన్వీనర్ పుట్ల గంగాద్రితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

చట్టం దృష్టిలో అందరూ సమానమే : ఎస్పీ

ప్రజాశక్తి-హిందూపురం

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

వినాయకుని ఊరేగింపు సమయంలో కొల్లకుంట గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్న సంఘటనలో ఇరువురుపై కేసులు నమోదు చేశామని చట్టం దృష్టిలో అందరూ సమానమే అనిఎస్పీ వి.రత్న తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కొల్లకుంట గ్రామంలో జరిగిన గొడవను సీరియస్‌గా తీసుకున్నామన్నారు. గ్రామంలో ఎలాంటి గొడవలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. వినాయకుల ఊరేగింపు సమయంలో ఇలాంటివి ఎక్కడైనా పునరావతమైతే అటువంటి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హిందూపురం పట్టణంలో ఈ నెల 13న జరిగే శోభాయాత్ర, వినాయక ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని ఈ సందర్భంగా ఎస్పీ కోరారు.

విద్యార్థినులపై ఆకతాయి చేష్టలు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల కేంద్రంలోని సాయి నగర్‌లో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులపై మరో పాఠశాలలో చదువుతున్న విద్యార్థి స్ప్రే చేశాడు. బుధవారం మధ్యాహ్నం ఒకటిన్నర గంట సమయంలో ఒక ప్రైవేటు పాఠశాలలో చదువుకునే బాలుడు స్కూలుకు వెళ్లకుండా వినాయక నిమజ్జనంలో ఉపయోగించే స్ప్రే తన దగ్గర ఉంచుకొని పాఠశాలలోని వరండాలో నీరు తాగటానికి వెళ్లిన విద్యార్థిని చేతిపై స్ప్రే చేశాడు. విద్యార్థిని చేతులు మరో ఇద్దరు ముగ్గురు విద్యార్థులకు తగలడంతో పిల్లలకు కన్నులు ,శరీరం, కొద్దిపాటి మంటలు రావడంతో ఉపాధ్యాయులకు తెలిపారు.ఉపాధ్యాయుడు సంజీవ రాయుడు, విషయాన్ని మండల విద్యాధికారికి, పిల్లల తల్లిదండ్రులకు తెలియజేశారు. విద్యార్థులను ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లి వైద్యం చేయించగా విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని ఎం కొత్తపల్లి గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ కార్యకర్త మైలారప్ప (45) బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకొన్న మంత్రి సవిత భర్త వెంకటేశ్వరరావు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని అంత్యక్రియల కోసం ఆర్థికసాయం చేశారు. అదే విధంగా హిందూపురం ఎంపీ పార్థసారథి అల్లుడు శశిభూషణ మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహులు, సుబ్బరత్నమ్మ, మంజు, మాధవనాయుడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మండల స్థాయి ఆటల పోటీలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నుంచి స్కూల్ గేమ్స్ మండల స్థాయి ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ వెంకటనాయుడు పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండల స్థాయి ఆటల పోటీలను నిర్వహించేందుకు రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికైందన్నారు. ఇందులో అండర్-14, 17 బాల బాలికలకు ఖోఖో,కబడ్డీ, వాలీబాల్, షటిల్ బాడ్మింటన్, చెస్, యోగ, తదితర విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చునన్నారు. ఈ సమావేశంలో పీడీ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలి

వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

ఆసుపత్రిలో బాధితుడిని పరామర్శిస్తున్న ఉషశ్రీ చరణ్, తదితరులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ పరిధిలోని కొల్లకుంట గ్రామంలో వైసిపి కుటుంబ సభ్యులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ డిమాండ్ చేశారు. కొల్లకుంటకు వైసిపి నాయకుడు శివశంకర్ రెడ్డి కుటుంబ సభ్యులపై టిడిపి నాయకుల మూకుమ్మడి దాడి ఘటనలో గాయాలకు గురై హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఉషశ్రీ చరణ్‌తోపాటు వైసిపి సమన్వయకర్త దీపిక పరామర్శించారు. దాడిలో గాయపడ్డ బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. అనంతరం వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి స్థానిక ప్రభుత్వాసుపత్రి నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు నిరసన ర్యాలీ చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని విమర్శించారు. వైసిపి నాయకులు రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేస్తున్న విషయాన్నితెలుసుకున్న వన్ టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడు, అప్ గ్రేడ్ స్టేషన్ సీఐ ఆంజనేయులు అక్కడికి వచ్చి ఇరు వర్గాల వారిపై కేసు నమోదు చేశామని నిరసనను విరమించాలని సూచించారు. టిడిపి నాయకులు వైసిపి నాయకులపై మూకుమ్మడి దాడి చేస్తే వైసిపి నాయకులపై కేసు ఎలా నమోదు చేస్తారని సిఐలతో ఉషశ్రీ చరణ్ వాదించారు. ఈ కార్యక్రమంలో మాజీ సమన్వ కర్త కొండూరు వేణు గోపాల్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మేన్లు జబివుల్లా, బలరామిరెడ్డి, నాయకులు వేణు రెడ్డి, బసారెడ్డి, హనుమంత రెడ్డి, శ్రీరామిరెడ్డి, మన్సూర్, నాగమణి, కవిత, కౌన్సిలర్లు షాజియా, మహేష్‌తో పాటు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - మడకశిర

సీజనల్ వ్యాధులపై డాక్టర్లు అప్రమత్తంగా ఉంటూ రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని డిఎంహెచ్ఒ మంజువాణి తెలిపారు. బుధవారం పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్ న్యూ ఎస్సీ కాలనీ, ఇతర పిహెచ్‌సిల డాక్టర్లు, సూపర్వైజర్‌తో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా టిఆర్ఎస్ పోర్టల్ గురించి వారికి అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు, ఫీవర్ సర్వే గురించి వివరించారు.

బాల్యాన్ని కాపాడుదాం : పీడీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

అంతర్జాల మోసాలు, నేరాల ఊబి నుండి బాల్యాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఐసిడిఎస్ పీడీ నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్, మహిళ శిశు సంక్షేమ శాఖ , జిల్లా బాలల పరిరక్షణ సమితి సంయుక్తంగా పుట్టపర్తి మండల సమాఖ్య సమావేశ మందిరంలో బుధవారం సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పీడీ మాట్లాడుతూ సైబర్ గ్రూమింగ్ అంటే ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఆన్‌లైన్‌లో పిల్లలు ఎమోషనల్ అయ్యే విధంగా మాట్లాడటం, వికృత చేష్టలు చేయడం, బూతు చిత్రాల ద్వారా రెచ్చకొట్టే ప్రయత్నం చేయడం,టెక్స్ట్ సమాచారాన్ని పంపి పిల్లలతో కనెక్షన్‌ని ఏర్పరచుకుని లైంగిక దోపిడీకి పాల్పటడం లాంటి వాటి నుంచి పిల్లలు తమని తాము ఎలా రక్షించుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో బుక్కపట్నం,కొత్తచెరువు, పుట్టపర్తి మండలాల్లో పని చేసే మహిళా పోలీసులు, సీఆర్పీలకు, యువతకు ఆన్‌లైన్‌లో జరిగే అనర్థాలు గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి మహేష్, జిల్లా కోఆర్డినేటర్ యస్ యస్ -ఆలేస్కో ఆనందబాబు, ఎపిఎం లలిత, సిఐఎఫ్ జిల్లా ప్రతినిధి కొండప్ప, జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రొటెక్షన్ ఆఫీసర్ మురళి, నాగలక్ష్మి, శిశగృహ మేనేజర్ సునీత, సోషియల్ వర్కర్ ఆనంద్, వనజాక్షి, యూత్ అంబాసిడర్లు దేదీప్య,షెహతాజ్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు, ఉపాధ్యాయులు

యుటిఎఫ్ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - మడకశిర

నియోజకవర్గ వ్యాప్తంగా యుటిఎఫ్ సభ్యత నమోదు కార్యక్రమం జోరుగా సాగుతున్నట్లు ఆసంఘం జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న తెలిపారు. బుధవారం యుటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా నాయకులు భూతన్న, మాలింగప్ప, హెచ్. సుదర్శన్, డి. నరసింహప్ప, టీ.మూడ్లగిరియప్ప, కదిరన్న ఆధ్వర్యంలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

గుడిబండ సిడిపిఒగా శాంతలక్ష్మి

ప్రజాశక్తి - గుడిబండ

పెనుగొండ ప్రాజెక్ట్ ఐసిడిఎస్ సిడిపిఒగా విధులు నిర్వహిస్తున్న సిడిపిఒ శాంత లక్ష్మి గుడిబండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒగా అదనపు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న సిడిపిఒ పద్మావతి బదిలీపై వెళ్లడంతో ఆస్థానం ఖాళీగా ఉంది.ఈ స్థానంలో పెనుగొండ ప్రాజెక్టులో విధులు నిర్వహిస్తున్న శాంతలక్ష్మికి అదనపు బాధ్యతలు ఇస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ కమలమ్మ, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు మహదేవమ్మ అంగన్వాడి కార్యకర్తలు శాంతలక్ష్మికి స్వాగతం పలికారు.

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్



ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళి

ఆనాటి రజకార్లకు, పెత్తందారులకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ చేసిన భూ పోరాటాలు స్ఫూర్తి దాయకమని రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బాపనపల్లి శివప్ప అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లిలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి బురుగుల నాగరాజు, నియోజకవర్గం అధ్యక్షులు గంగాద్రి, జిల్లా మహిళా కన్వీనర్ కొత్తచెరువు రాధమ్మ, మాజీ కౌన్సిలర్ చెన్నకృష్ణమ్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు చేపట్టే పంటకోత ప్రయోగాలను పారదర్శకంగా చేపట్టాలని గ్రామ వ్యవసాయ అధికారులకు ఎడిఎ డాక్టర్ కెఎస్ లక్ష్మీనరసింహశర్మ, ఏవో ఓబిరెడ్డి సూచించారు. బుధవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏఓ ఓబిరెడ్డి అధ్యక్షతన ఉచిత పంటల బీమా పథకం, పంటకోత ప్రయోగాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత పంటల బీమా పథకం కింద ఎంపికైన కంది, ఆముదం, వరి పంటల పంటకోత ప్రయోగాలను నిర్వహించే విధానాన్ని వివరించారు. అనంతరం వివిధ అంశాలపైన శిక్షణ ఇచ్చారు.